ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- నత్తనడకన నిర్మాణ పనులు
- ఇరుకైన గదుల్లోనే వైద్యసేవలు
- రోగులను వేధిస్తోన్న బెడ్ల కొరత
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



నిర్మాణ దశలో నెల్లిమర్ల సీహెచ్‌సీ భవనం

నెల్లిమర్ల: స్థానిక సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం) నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభమై ఐదేళ్లు గడుస్తూ ఇప్పటికీ ఓ కొలిక్కిరాలేదు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మాణం ప్రారంభించగా, ఆ తర్వాత కొంతకాలం పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆస్పత్రి అదనపు గదుల నిర్మాణం 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. నిర్మాణం ఎప్పటికీ వినియోగంలోకి రాకపోవడంతో సరిపడ గదుల్లేక అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని, ఆస్పత్రి భవనాలు వినియోగంలోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

ఆస్పత్రి వరండాలోనే ఓపీలు..

పాత సీహెచ్‌సీ ఇరుకైన గదుల్లోనే రోగులకు వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి. గర్భిణులు, సాధారణ రోగులు.. ఇలా అందరినీ ఒకేచోట ఉంచి వైద్య తనిఖీలు, చికిత్స అందించడం జరుగుతోంది. ప్రతిరోజూ ఆస్పత్రికి 200 మంది నుంచి 300 మంది వరకు రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. ఆస్పత్రి వరండాలోనే ఓపీ రోగులను తనిఖీ చేసి, పంపాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో రోగులు ఆస్పత్రిని ఆశ్రయించేందుకు భయపడుతున్నారు. పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్త భవనంలో వాడేందుకు వచ్చిన బెడ్లు

16 బెడ్లు మాత్రమే..

ఓపీ అనంతరం చికిత్స నిమిత్తం ఉండాలనుకుంటున్న రోగులకు సరిపడ బెడ్లు లేవు. 30 పడకల ఆస్పత్రిలో 16 పడకలు(బెడ్లు) మాత్రమే వినియోగంలో ఉన్నాయి. ప్రతిరోజూ 50 మందికి పైగా రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. నెలకు 20కు పైగా డెలివరీలు జరుగుతుంటాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ ఆస్పత్రిలో సరిపడ సదుపాయాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవన నిర్మాణం పూర్తికాకపోయినప్పటికీ ఇప్పటికే ఆస్పత్రికి వచ్చిన ఎక్స్‌రే తదితర యంత్ర పరికరాలు ఓ మూలన పడేశారు. అవి ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యేటప్పటికీ పాడవుతాయేమోనన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు.



ఇరుకైన గదిలోనే ఇలా విలువైన ఎక్స్‌రే మిషన్, ఇతర పరికరాలు

కేంద్రాస్పత్రికి కేసుల రిఫర్..

ప్రమాద బాధితులకు ఎక్స్‌రే చేయించుకునే సదుపాయం ఈ ఆస్పత్రిలో లేకపోవడంతో కేంద్ర సర్వజన ఆస్పత్రికి కేసులను రిఫర్ చేయాల్సి వస్తోంది. అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలు ఇలా అన్నీ ఉన్నా సరిపడ గదులు లేకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇక్కడి ఆస్పత్రికి వచ్చినా జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. తనిఖీలకు మాత్రమే వెళ్లాల్సి వస్తోందని, వైద్యానికి మాత్రం వేరే ఆస్పత్రి వెతుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మెరుగైన సేవలందిస్తాం..

ఆస్పత్రి నిర్మాణం ప్రారంభమై ఐదేళ్లు దాటింది. పనులు పూర్తయి నిర్మాణం అందుబాటులోకి రాగానే మెరుగైన సేవలందిస్తాం. గర్భిణులు, సాధారణ రోగులకు ఒకే గదిలో వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి ఉన్న విషయం వాస్తమే. త్వరగా పనులు పూర్తయ్యేలా తమవంతు ప్రయత్నం చేస్తున్నాం.

–డాక్టర్ గీతాభవాని,
సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, నెల్లిమర్ల

క్లుప్తంగా

23 నుంచి సత్తెమ్మ జాతర మహోత్సవాలు



పూజలందుకుంటున్న సత్తెమ్మతల్లి

విజయనగరం టౌన్: స్థానిక వైఎస్సార్ నగర్‌లో కొలువుదీరిన సత్తెమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి జరగనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. తొలిరోజు జోగి కార్యక్రమం, 24న ఘటాల నిలుపుదల, అమ్మవారికి పుసుపు, కుంకుమ పూజలు, 25న చదురుగుడి వద్ద ఘటాలకు పూజలు చేయడం, అమ్మవారి ప్రతిమను తోడ్కొనిరావడం వంటివి చేయడం జరుగుతుందన్నారు.

ప్రశంసాపత్రం అందజేత



ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏఎస్‌ఐ రమణమూర్తి

నెల్లిమర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కేవీ రమణమూర్తికి ఎస్పీ వకుల్ జిందల్ చేతులమీదుగా ప్రశంసాపత్రం జిల్లా కేంద్రంలో గురువారం అందజేశారు. గంజాయి నిర్మూలన, ఇతర కేసుల ఛేదనలో చురుగ్గా పనిచేసినందుకు గాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా రమణమూర్తికి భోగాపురం సీఐ రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్‌ఐ గణేష్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కాలువల్లో చెత్తాచెదారం వేయొద్దు



పూడికతీతలను పరిశీలిస్తున్న నగరపంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్

నెల్లిమర్ల: కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని నగరపంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ సూచించారు. స్థానిక ఇందిరా కాలనీలో పారిశుధ్య పనులు గురువారం నిర్వహించారు. ప్రధాన రోడ్డులోని మురుగునీటి కాలువల్లో చేస్తున్న పూడిక తీతలను ఆయన చూసి, పలు సూచనలు చేశారు. ప్రతి కాలువల గుండా మురుగునీరు సాఫీగా ముందుకు వెళ్లేలా చూడాలన్నారు. ప్రజలు కూడా పారిశుధ్యానికి సహకరించాలని, సిబ్బందికి పొడి, తడి చెత్తలను వేర్వేరుగా అందించాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా భాస్కర్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

విజయనగరం ఫోర్ట్: నగర పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. వివేకానంద కాలనీ, పోలయ్యపేట, బొగ్గులదిబ్బ, ఎల్బీకాలనీ, కంటోన్మెంట్ పోస్టాఫీస్ ఏరియా, హోటల్ సాలిమర్ ఏరియా, వీటీ అగ్రహారం సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌అండ్‌బీ ఏరియా, అలకానందకాలనీ, కుసుమ గజపతినగర్, సీబీ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, రింగ్ రోడ్డు, ఏనుగుల తోట, కుమ్మరి వీధి, జొన్నగుడ్డి, నాగవంశం వీధి, ప్రశాంతినగర్, స్టేడియం కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డెంకాడ: మండలంలోని రాజపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ సురేష్‌బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మోదవలస, గొండయ్యపాలెం, జరజాపు కల్లాలు, బంగారాజుపేట, కొండరాజుపేట, చినవల్లూరు, పెదవల్లూరు గ్రామాలతో పాటు భోగాపురం మండలంలోని రాజపులోవ, మహారాజుపేట, చెరుకుపల్లి, పోలిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



వార్డు పర్యటనలో స్థానికుల సమస్యలపై ఆరాతీస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని, దీనికి ప్రజల సహకారం కూడా అవసరమని నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. వార్డు పర్యటనలో భాగంగా స్థానిక 30వ డివిజన్‌లోని ధర్మపురిలో ఆయన గురువారం పర్యటించారు. అక్కడి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కుళాయిలు హెడ్‌లు లేవని, నీరు వృథాగా పోతోందని పలువురు తెలుపగా కుళాయిల హెడ్‌లు బిగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పలుచోట్ల వీధిదీపాల సమస్య ఉన్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. ఇదిలా ఉండగా కొన్నిచోట్ల రోడ్లపైనే భవన నిర్మాణ వ్యర్థాలు పడి ఉండడాన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఆ చెత్తను తొలగించాలని సంబంధిత ఇంటి యజమానికి సూచించారు. ధర్మపురిలో ఎండిపోయిన భారీవృక్షం తొలగింపు చర్యలు చేపడతామని, ఇంటర్ కనక్షన్ల ద్వారా నీటి పంపిణీకి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పతివాడ గణపతిరావు, ఏఈ సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వాహనాలు ప్రారంభం



ప్రచారానికి సిద్ధం చేసిన వాహనాలు

విజయనగరం: వేసవి ఎండల నేపథ్యంలో ప్రజలు ఉష్ణతాపానికి గురికాకుండా చైతన్యం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రచార వాహనాలను నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య నగరంలో గురువారం ప్రారంభించారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఏ విధంగా ఉండాలోనన్న విషయాలను ఈ వాహనం ద్వారా ప్రచారం చేయనున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికే వేసవితాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగేలా చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పుడు ఈ చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వామ్మో..ఎండలు!















భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. సుర్రుమనిపించే ఎండలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. ఉదయం 9 గంటలైతే చాలు..మండే ఎండ ప్రారంభమైపోతోంది. మధ్యాహ్నం 12 గంటలైతే వాతావరణం ఒక్కసారిగా వేడెక్కి, వేడిగాలి తప్ప చల్లగాలి పీల్చలేని పరిస్థితి. ఎండలకు భయపడి చాలామంది ఇంటికే పరిమితమవుతున్నారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చే కొంతమంది మాత్రం ఇలా ఎండ నుంచి రక్షణగా తలకు గొడుగు, ముఖానికి స్కార్ఫ్ పట్టుకుని వస్తున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం ఎండలో ఇలా ప్రయాణిస్తున్న వారిని చిత్రంలో చూడొచ్చు.

–ఫొటోగ్రాఫర్, విజయనగరం

గుట్టలు గుట్టలుగా వ్యర్థాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న భవన నిర్మాణ వ్యర్థాలు.. విజయనగరం కలెక్టరేట్ భవనం మధ్యలోని ఖాళీ ప్రదేశంలో గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. వీటితో పాటు పిచ్చిమొక్కలు కూడా విపరీతంగా పెరిగి ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఉండే కార్యాలయం వద్దే ఇలాంటి పరిస్థితి ఉంటే మిగతా ప్రాంతాల్లో ఎటువంటి అపరిశుభ్ర వాతావరణం ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ కోసం చేపట్టే స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమ ఫలితం కనిపించడం లేదు. సాక్షాత్తు కలెక్టరేట్‌లోనే కార్యక్రమ లక్ష్యం నెరవేరకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు చెబుతారు గానీ వారి కార్యాలయాల వద్ద పరిశుభ్రత ఏ విధంగా ఉందో తెలీదా అని ప్రశ్నిస్తున్నారు.

–విజయనగరం టౌన్

ప్రజలు 'బోరు'మనేలా..



నెల్లిమర్ల మండలం, గొర్లిపేట వద్ద గిరి ప్రదక్షిణ రోడ్డులోని తాగునీటి బోరు నిరుపయోగంగా మారింది. ఏడాది క్రితమే ఇది మరమ్మతులకు గురి కాగా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వేసవి కొనసాగుతున్నా.. తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉంటే సరిగ్గా ఆరు నెలల క్రితం జరిగిన గిరి ప్రదక్షిణ రోడ్డు పనుల్లో ఈ బోరును ఇలా మట్టితో కప్పేశారు. ఇది చూసినా వారంతా ఒకవేళ బోరు బాగు చేసినా నీరు ఎలా తోడుకోవాలి, తాగాలని ప్రశ్నిస్తున్నారు. బోడికొండకు వెళ్లే వారందరికీ తాగునీటి అవసరాలకు ఈ బోరు చాలా ఉపయోగపడేది. ఇప్పుడు ఇది పనికిరాకుండా నిరుపయోగంగా ఉండడంతో పాటు ఇలా అధికారుల నిర్లక్ష్యానికి గురికావడంపై పలువురు విమర్శిస్తున్నారు. తాగునీటి కోసం ప్రజలు బోరుమని ఏడుస్తుంటే.. వారి ఏడుపు పట్టదా అని అధికారులను నిలదీస్తున్నారు.

–నెల్లిమర్ల రూరల్

ఆదమరిస్తే అంతే..



వాహనాలతో రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆదమరిచి ముందుకు వెళ్తే ప్రమాదం కొనితెచ్చుకోక తప్పదు. కొందరు ఏదో ఆలోచించుకుని వాహనం నడపగా, మరికొంతమంది సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తారు. ఇలాంటి చిన్నచిన్న పొరపాట్లే జీవితాంతం బాధపడేలా రోడ్డు ప్రమాదాలుగా మారుతాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాలతో రోడ్లుపైకి వస్తే నిదానంగా ముందుకుసాగాలని పలువురు కోరుతున్నారు. గురువారం ఉదయం విజయనగరం జిల్లా కలెక్టరేట్ దగ్గరలో పొరపాటున ఓ ద్విచక్ర వాహనదారుడిని మరొక ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్న ఘటనను ఈ చిత్రంలో చూడొచ్చు.

–ఫొటోగ్రాఫర్, విజయనగరం

సేవలను సులభతరం చేసి అందివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నాయుడు

విజయనగరం: ప్రణాళికారంగ సేవలను సులభతరం చేసి, ప్రజలకు అందివ్వాలని టౌన్ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నాయుడు ఆదేశించారు. స్థానిక నగర కార్పొరేషన్ కార్యాలయంలో విజయనగరం, నెల్లిమర్ల పట్టణాల ప్రణాళికా విభాగం సిబ్బంది, కార్యదర్శులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ప్రజల ముంగిటకు వేగవంతంగా, సులభంగా ప్రణాళికా రంగ సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని ప్రభుత్వం అవలంబిస్తోందని, తదనుగుణంగా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాలన్నారు. ప్రణాళికా విభాగంలో మరింత నూతన ఒరవడిని తీసుకువచ్చేందుకు వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన బృందం అనేక విషయాలపై అధ్యయనం చేసిందన్నారు. ఫలితంగా మెరుగైన విధానాలు ప్రస్తుతం అమలు చేస్తోందన్నారు. వీటిపై సిబ్బంది అంతా అవగాహన పెంచుకుని, ప్రజలకు చేరువ చేయాలన్నారు. సమావేశంలో డీటీసీపీ నాగలక్ష్మి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో నిరుపయోగంగా శుద్ధజల కేంద్రం



వినియోగంలో లేని శుద్ధజల కేంద్రం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం గ్రామంలో స్థానిక కుమ్మరి ఖానా వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ప్రజలకు నాణ్యమైన మంచి నీటిని అందించాలనే సంకల్పంతో ఎంపీ ల్యాడ్ నిధులతో 2015లో ఇక్కడ శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణ కొరవడడంతో ఏర్పాటు చేసిన కొద్ది నెలల్లోనే ప్లాంట్ మూలకు చేరి దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. నీటిని శుభ్రం చేసే యంత్రాలు కూడా శిథిలావస్థకు చేరాయి. రామతీర్థం ప్రజలు వినియోగిస్తున్న మంచి నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉందని గతంలో అధికారులు గుర్తించి శుద్ధజలకేంద్రాన్ని ఏర్పాటు చేశారని, కూటమి ప్రభుత్వం స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పదోన్నతి

డెంకాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యురాలు భవానికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఇప్పుడు ఆమె స్థానంలో డాక్టర్ ఎన్.అనూష గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు.